ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024





మాడుగుల సభలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న లోకేశ్, పీవీజీ కుమార్, సత్యవతి

ఉత్తరాంధ్రను దోచుకుంటున్న వైసీపీ నేతలు

బొత్స, విజయసాయి, వైవీలు ఈ ప్రాంతాన్ని మింగేస్తున్నారు

- టీడీపీ యువనేత నారా లోకేశ్ ధ్వజం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వైసీపీ ప్రోత్సాహం
- టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- జగన్ పాదయాత్రలో ఉమ్మడి జిల్లాలో 50కిపైగా హామీలు.. సీఎం అయిన తరువాత ఒక్కటీ అమలు చేయలేదు
- మూడు షుగర్ ఫ్యాక్టరీలను మూసేయించారు
- కొత్త పరిశ్రమలు ఒక్కటీ రాలేదు
- కోడిగుడ్డు మంత్రి దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోతున్నాయి
- టీడీపీ హయాంలో 'నర్సీపట్నం'లో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- నర్సీపట్నం శంఖారావం సభలో లోకేశ్





నర్సీపట్నం సభలో ప్రతిజ్ఞ చేస్తున్న నారా లోకేశ్, సీహెచ్ అయ్యన్నపాత్రుడు, బుద్ద నాగజగదీశ్వరరావు, పంచకర్ల రమేశ్‌బాబు, వేపాడ చిరంజీవిరావు, చింతకాయల విజయ్, రాజేశ్, రాజాన సూర్యచంద్ర

నర్సీపట్నం, ఫిబ్రవరి 20: ఉత్తరాంధ్రను దోచుకునేందుకు వైసీపీ ప్రభుత్వం ముగ్గురికి లైసెన్స్ ఇచ్చిందని, బొత్స సత్యనారాయణ, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పందికొక్కుల్లా తింటున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. మంగళవారం మధ్యాహ్నం నర్సీపట్నంలోని బలిఘట్టంలో ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వైసీపీ పాలకులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ... మిగతా 8వ పేజీలో

మాడుగులలో ప్రకృతి సంపద దోపిడీ

గ్రానైట్ క్వారీల నుంచి నెలకు రూ.కోటి చొప్పున డిప్యూటీ సీఎంకు మామూళ్లు

- ముడుపులు ఇస్తేనే ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులు
- సీసీ రోడ్లు వేయలేదు.. గోతులు పూడ్చలేదు
- మంత్రి 'బూడి'పై టీడీపీ నేత లోకేశ్ ఆరోపణలు

మాడుగుల/ మాడుగుల రూరల్, ఫిబ్రవరి 20: "మాడుగుల నియోజకవర్గంలో ఇసుక, ఖనిజం సహా ప్రకృతి వనరులన్నీ దోచుకోవడమే ఆయన పని. రోడ్ల నిర్మాణ పనులను తన సొంత కంపెనీ ద్వారానే చేయిస్తారు. స్థానికంగా ఉన్న క్వారీల యజమానులు నెలకు కోటి రూపాయలను ఆయనకు సమర్పించుకోవాల్సిందే. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఆయన.. ఈ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి నిల్.. అవినీతి మాత్రం ఫుల్" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం ఉదయం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో నిర్వహించిన ... మిగతా 8వ పేజీలో

పేట టీడీపీకి కంచుకోట



కోటవురట్ల సభలో లోకేశ్‌కు నాగలి బహూకరిస్తున్న రైతు. పక్కన గెడ్డం బుజ్జి, వంగలపూడి అనిత

- వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత తీసుకుంటా
- కోటవురట్ల 'శంఖారావం' సభలో నారా లోకేశ్
- రాజాం చెత్త.. 'పేటలో పసిడి అవుతుందా? అని జోగులును ఉద్దేశించి విమర్శ

కోటవురట్ల, ఫిబ్రవరి 20: తెలుగుదేశం పార్టీకి పాయకరావుపేట నియోజకవర్గం కంచుకోటని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని అధిక మెజారిటీ గెలిపించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఇక్కడ నిర్వహించిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, వైసీపీ ప్రభుత్వం మూసివేసిన సహకార షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులు, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా రాజాం నుంచి చెత్తను తీసుకువచ్చి పాయకరావుపేటలో పెడితే పసిడి అవుతుందా? ఈ నియోజకవర్గంలో ఏ ప్రాజెక్టు ఎక్కడో ఉందో ... మిగతా 8వ పేజీలో



కోటవురట్లలో శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు


కోటవురట్ల సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్

మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు వద్ద నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన టీడీపీ శ్రేణులు

మిలాన్ మెరుపులు

ఆర్‌కే బీచ్ రోడ్డులో రెండు వేల మందితో ఫుల్ డ్రెస్ రిహార్సల్

- ఇంటర్నేషనల్ సిటీ పరేడ్...పాల్గొన్న 50 దేశాల ప్రతినిధులు
- యుద్ధ విమానాల విన్యాసాలతో దద్దరిల్లిన గగనతలం



జాతీయ పతాకం రంగులు ఆవిష్కరించేలా సముద్రంలో బాంబులు పేల్చిన దృశ్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'మిలాన్' మెరుపులతో ఆర్‌కే బీచ్ అదిరిపోయింది. యుద్ధ విమానాల విన్యాసాలతో ఆకాశం దద్దరిల్లిపోయింది. నేవీ బృందాల సంగీతంతో, సైనిక విద్యార్థుల నృత్యాలతో సాగరతీరం పులకించిపోయింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన నౌకా దళాలతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ (అంతర్జాతీయ నగర కవాతు) ఫుల్ డ్రస్ రిహార్సల్ అబ్బురపరచింది. భారత వైమానిక దళం శక్తి సామర్థ్యాల ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ అతిథిగా విచ్చేశారు.

ఆర్కే బీచ్‌రోడ్డులో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు 100 నిమిషాలు నిరాటంకంగా కొనసాగాయి. మిత్రదేశాలతో అంతర్జాతీయ అవగాహన, విశ్వజనీన స్నేహభావన పెంపొందించేలా సాగిన కవాతు ఆద్యంతం ఆకట్టుకుంది. వైమానిక దళంలో ఉన్న సీ కింగ్ హెలికాప్టర్లు, సీ హాక్‌లు, చేతక్‌లు, డార్నియర్లు, జెట్ ఫైటర్లు, పూర్తిగా స్వదేశీ ... మిగతా 7వ పేజీలో



ప్రదర్శనలో తేజస్ యుద్ధ విమానం

కన్నబాబురాజు అక్రమార్జనను వెలికితీస్తాం

- ఎమ్మెల్యేగా పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టారు
- వైసీపీ, టీడీపీ, జనసేన నాయకులు ఆరోపణ



ఎమ్మెల్యే కన్నబాబురాజుకు వ్యతిరేకంగా అచ్యుతాపురంలో సమావేశమైన వైసీపీ, టీడీపీ, జనసేన నాయకులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20: ఎలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు రాజు) సుమారు పదిహేనేళ్లపాటు ప్రజాప్రతినిధిగా వుండి అడ్డగోలుగా ఆస్తులు కూడబెట్టారని వైసీపీతో పాటు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, సెజ్ నిర్వాసితులు ఆరోపించారు. మంగళవారం అచ్యుతాపురంలోని ఒక లాడ్జిలో సమావేశమైన వీరు.. కన్నబాబురాజు రాజకీయాల్లోకి రాకముందు ఆర్థిక పరిస్థితి ఏమిటి? ఇప్పుడు ఆర్థిక పరిస్థితి ఏమిటి? అన్నదానిపై నిగ్గుతేలుస్తామని స్పష్టం చేశారు. 2004లో తొలిసారి ఎమ్మెల్యే అయిన తరువాత ఏపీఐఐసీని బూచీగా చూపించి సెజ్‌కు చుట్టుపక్కల రైతుల నుంచి కారు చౌకగా భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు. రెండవసారి ఎమ్మెల్యే అయిన తరువాత గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపించి, సెజ్‌లోని కర్మాగారాలకు అమ్ముకుని రూ.కోట్లు గడించారన్నారు. దళిత మహిళల పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని బస్సులు కొనుగోలు చేశారని, తరువాత 'తేజ లాజిస్టిక్స్' పేరుతో ఆ బస్సులను సెజ్ ... మిగతా 8వ పేజీలో

దళితులంటే ఎమ్మెల్యే ధర్మశ్రీకి చిన్నచూపు

ఎస్సీ, బీసీలకు పాలన చేతకాదని అవహేళన చేశారు

- పంచాయతీ అధికారాలను వైసీపీ గ్రామ అధ్యక్షుడికి కట్టబెట్టారు
- వడ్డాది మేజర్ పంచాయతీ సర్పంచ్ కామలక్ష్మి ఆవేదన
- రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపణ
- ఉపసర్పంచ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లతో కలిసి మీడియా సమావేశం
- ధర్మశ్రీ తీరు మార్చుకోకపోతే వైసీపీని వీడక తప్పదని విస్పష్టం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్డాది సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, పక్కన ఉపసర్పంచ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్, తదితరులు ఉన్నారు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 20: దళితులు, బలహీన వర్గాలకు చెందినవారు పంచాయతీ పాలన చేయలేరంటూ చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హేళనగా మాట్లాడారని అధికార పార్టీకే చెందిన అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది మేజర్ పంచాయతీ సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి (ఎస్సీ) ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం వడ్డాదిలో ఉప సర్పంచ్ సూర్యనాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు, తదితరులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మశ్రీ పంచాయతీరాజ్ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, ప్రజలు ఎన్నుకున్న తమను అవమానించేలా పాలన బాధ్యతలను వైసీపీ గ్రామ అధ్యక్షుడికి అప్పగించారని వాపోయారు. మూడేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ మద్దతుతో పోటీ చేసిన తనను ప్రజలు ఎన్నుకున్నారని, అదే విధంగా ఉపసర్పంచ్‌గా బీసీ వర్గాలకు చెందిన సూర్యనాగేశ్వరరావు ఎన్నికయ్యారని, కానీ పంచాయతీ పాలన బాధ్యతలను తమ ఇద్దరికి కాకుండా వైసీపీ గ్రామ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తికి కట్టబెట్టడం ద్వారా ఎమ్మెల్యే ధర్మశ్రీ.. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ... మిగతా 8వ పేజీలో

జనాన్ని తెండి...

సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులకు టార్గెట్లు

- నేడు విశాఖ శారదా పీఠానికి రానున్న ముఖ్యమంత్రి
- విమానాశ్రయం నుంచి పీఠానికి వెళ్లే మార్గంలో పాయింట్‌కు 500 మంది ఉండాలని లక్ష్యం
- ఆర్‌పీలు, వలంటీర్లకు బాధ్యతలు
- జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అంటే విశాఖలో అధికారులతో పాటు ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఆయన వచ్చిన ప్రతిసారీ జన సమీకరణ చేయాలని ఆదేశిస్తున్నారు. దీంతో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. తాజాగా చినముషిడివాడలోని శారదాపీఠంలో రాజశ్యామల పూజలో పాల్గొనడానికి సీఎం బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. విజయవాడ నుంచి బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి ఉదయం 11.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా చినముషిడివాడలోని పీఠానికి వెళతారు. గంట సేపు అక్కడ ఉండి పూజలు చేస్తారు. 12.40 గంటలకు బయలుదేరి 12.55 గంటలకు విమానాశ్రయం చేరుకొని విజయవాడకు వెళతారు. విమానాశ్రయం నుంచి 15 నిమిషాలు ప్రయాణిస్తే పీఠం వస్తుంది. అయితే ఈ మార్గంలో 24 పాయింట్లు గుర్తించి, అక్కడ జనాలను ఉంచాలని జీవీఎంసీ అధికారులకు పైనుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక్కో పాయింట్ వద్ద 500 మందికి తక్కువ లేకుండా చూడాలని సూచించారు. డ్వాక్రా గ్రూపు మహిళలను తరలించే బాధ్యతలను రీసోర్స్ పర్సన్లకు, పెన్షనర్లను తీసుకువచ్చే బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు. వీరిని సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం చేసే బాధ్యత ... మిగతా 8వ పేజీలో



కోటవురట్ల సభకు అధిక సంఖ్యలో హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నర్సీపట్నం సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

అదే జోరు.. కేడర్‌లో హుషారు

- శంఖారావం సభలకు పోటెత్తిన టీడీపీ శ్రేణులు
- లోకేశ్ ప్రసంగాలకు విశేష స్పందన

అనకాపల్లి జిల్లాలో మంగళవారం మూడు చోట్ల శంఖారావం సభలు విజయవంతంగా జరిగాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రసంగాలకు విశేష స్పందన లభించింది. మాడుగుల మండలం సురవరం వద్ద, నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో, కోటవురట్లలో నిర్వహించిన శంఖారావం సభలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. వైసీపీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను లోకేశ్ ఎండగట్టారు. పాలకుల అవినీతిపై ధ్వజమెత్తారు.



మాడుగులలో లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీవీజీ కుమార్ సతీమణి



మాడుగులలో కార్యకర్తల ఉత్సాహం



లోకేశ్‌కు పూల గద బహూకరిస్తున్న దృశ్యం



కోటవురట్ల సభలో లోకేశ్‌కు అల్లూరి సీతారామరాజు చిత్రపటం బహూకరిస్తున్న పీవీవీఎస్ఎన్ రాజు



మాడుగులలో లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న అభిమానులు



నర్సీపట్నంలో లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరికలు



మాడుగులలో దివ్యాంగ వృద్ధుని సమస్యలు ఆలకిస్తున్న లోకేశ్



నర్సీపట్నం సభలో చిరునవ్వులు చిందిస్తున్న లోకేశ్, అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం సభలో చప్పట్లు కొడుతూ సందడి చేస్తున్న మహిళలు



వెంకన్న చిత్రపటాన్ని అందజేస్తున్న గవిరెడ్డి రామానాయుడు

క్రైం... crime news

కల్వర్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

ఎలమంచిలి, ఫిబ్రవరి 20: మునిసిపాలిటీ పరిధిలోని పెంజెరువు సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపిన సమాచారం ప్రకారం.. మునిసిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఈరుగల ప్రసాద్ (27) ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం సాయంత్రం ఎస్.రాయవరం వెళ్లాడు. రాత్రి 9.30 గంటల సమయంలో తిరిగి ఎలమంచిలి వస్తుండగా పెంజెరువు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్నది. దీంతో ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. రహదారిపై వెళుతున్న వారు 108కు ఫోన్ చేయడంతో అంబులెన్స్‌లో సీహెచ్‌సీకి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఇతని తండ్రి చంద్రరావు మునిసిపాలిటీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్నారు. అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

120 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు

రోలుగుంట, ఫిబ్రవరి 20: మండలంలోని అర్ల- రత్నంపేట మధ్య మంగళవారం తెల్లవారుజామున 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అప్పలనాయుడు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడానికి ప్యాకెట్ల రూపంలో గంజాయిని అర్ల- రత్నంపేట మధ్య దాచిపెట్టినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిఘా పెట్టారు. గంజాయిని ఆటోలో ఎక్కిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధం ఉన్న అర్ల గ్రామానికి చెందిన బాణం ధర్మరాజు, రత్నంపేట గ్రామానికి చెందిన బోడెపు గంగన్న, చోలపాటి సోమునాయుడు, బీబీపట్నం గ్రామానికి చెందిన బియ్యాల అప్పలనాయుడులను అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. బియ్యాల అప్పలనాయుడుపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నాయని, పీడీ యాక్టు కూడా నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

జెడ్పీలో ఏడుగురికి పదోన్నతులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20: జిల్లా పరిషత్‌లో ఏడుగురు ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. ఆఫీస్ సబార్డినేట్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురికి రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	123.00
లైవ్ ధర	143.00
విత్ స్కిన్	256.00
స్కిన్ లెస్	266.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

టీడీపీలో భారీగా చేరికలు

- లోకేశ్ సమక్షంలో చేరిన 350 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు

మాడుగుల, ఫిబ్రవరి 20: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో మూడు పంచాయతీలకు చెందిన 350 మంది వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఘాటీరోడ్డు-సురవరం గ్రామాల మధ్య మంగళవారం జరిగిన శంఖారావం సభకు లోకేశ్ హాజరై ప్రసంగించారు.

అనంతరం మండలంలోని జాలంపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, ప్రస్తుత యాదవ సంఘం మండలాధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పల్లా భీమేశ్వరమ్మ (మాజీ సర్పంచ్), లంకెల దేముడు (కింతలి మాజీ కో-ఆపరేటివ్ డైరెక్టర్), మాడుగుల లక్ష్మణ్‌రావు (మాజీ ఉప సర్పంచ్), బచ్చుల వరలక్ష్మితో సహా 42 కుటుంబాలకు చెందిన 250 మంది ఆ గ్రామ టీడీపీ నాయకులు బానం బీమలింగేశ్వరరావు, చంటి, చిన్న, గోవింద, చిన్నారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

అలాగే ఎల్ పొన్నవోలు పంచాయతీ నుంచి చామంతులు అర్జునరావు (వైసీపీ యూత్ అధ్యక్షుడు), మాజీ వార్డు మెంబర్లు గట్టెం బుల్లమ్మ, వంతాల చిన్నమ్మలు, సాగాని దేముడమ్మతో సహా 97 మంది ఆ పంచాయతీ టీడీపీ నాయకులు యన్నంశెట్టి సత్యారావు, సంతోష్, పవన్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. అలాగే అవురివాడ పంచాయతీ నుంచి ముగ్గురు కూడా పార్టీలో చేరారు.

మొత్తం 350 మంది వైసీపీకి చెందిన నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో నారా లోకేశ్ చేతుల మీదుగా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసీపీలో కష్టపడి పనిచేసినప్పటికీ సరైన గుర్తింపు లేదని, ప్రస్తుత ప్రభుత్వం విధి విధానాలు బాగోలేనందున పార్టీని వీడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ సర్పంచ్ పల్లా శ్రీను, భీమేశ్వరమ్మలు తెలిపారు.



జాలంపల్లి మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు పల్లా శ్రీనివాసుకి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్



జాలంపల్లి మాజీ సర్పంచ్ పల్లా భీమేశ్వరమ్మకి పార్టీ కండువా వేస్తున్న దృశ్యం

శాస్త్రవేత్తల బృందం రబీ పంటలు పరిశీలన

- తెగుళ్ల నివారణకు పలు సూచనలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 20: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో మంగళవారం శాస్త్రవేత్తలు పర్యటించి రబీ పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, వి.చంద్రశేఖర్, కొక్కిరాపల్లి నువ్వు పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఏబీఎం శిరీష, డీఆర్‌సీ అధికారి తులసి, వ్యవసాయ శాఖ డీడీ రవి ప్రకాశ్ బృందం ఎలమంచిలి, కొత్తపాలెం, రాంబిల్లి మండలం మామిడివాడ, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, పెదపాడు గ్రామాల్లో పెసర, మినుము, జనుము, చెరకు పంటలను పరిశీలించారు. పెసర, మినుము పంటలను బూడిద తెగులు ఆశించినట్టు గుర్తించారు. దీని నివారణకు గంధకం పొడి లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండిజం మందును లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. చిత్తపురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి 1.6 మి.లీ.ల చొప్పున కలిపి పిచికారి చేయాని సూచించారు. చెరకులో వడల తెగులు లక్షణాలు కనిపిస్తే అటువంటి ఆకులు పీకివేసి కాల్చివేయాలన్నారు. చెరకులో వలయాకారపు మచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ మందును లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వీరి వెంట ఏఓలు మోహన్‌రావు, శంకర్ గోవింద్, సుమంత, సిబ్బంది దేవుడు, సంతోషి, ప్రవీణ, నీరజ వున్నారు.



కొత్తపాలెంలో పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వైసీపీ పాలనలో షుగర్ ఫ్యాక్టరీలు మూత

- ఆధునికీకరణ హామీని విస్మరించిన జగన్‌రెడ్డి
- 'శంఖారావం' సభలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు ధ్వజం



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఫిబ్రవరి 20: ప్రతిపక్షంలో వున్నప్పుడు పాదయాత్ర చేసిన జగన్‌రెడ్డి.. అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరిస్తామని చెప్పారని, కానీ సీఎం అయిన తరువాత తాండవ, ఏటికొప్పాక, తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సీహెచ్ అయ్యన్నపాత్రుడు విమర్శించారు. బలిఘట్టంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ, తమ హయాంలో నర్సీపట్నంలో 2,500 టిడ్కో ఇళ్లు నిర్మిస్తే, ఇంతవరకు వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేదని చెప్పారు. గ్రామస్థాయిలో పశువైద్య సేవలు అందించేందకు తాము గోపాల మిత్రలను నియమించగా, వైసీపీ ప్రభుత్వం వారిని తొలగించిందని, దీంతో గ్రామస్థాయిలో పశువులకు వైద్య సేవలు అందడంలేదని చెప్పారు. తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయలేని హీనస్థితిలో ఈ ప్రభుత్వం వుందని ఆరోపించారు. తాండవ రిజర్వాయర్‌లోకి నీరు వచ్చే ఎగువ ప్రాంతాన్ని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం తన బంధువుకు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి కట్టబెట్టారని, దీనివల్ల తాండవ ఆయకట్టుకు నీరు అందక రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని వలంటీర్లు దుష్ప్రచారం చేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతకన్నా మెరుగైన పథకాలను అందిస్తామని అయ్యన్న చెప్పారు. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఓట్లు వేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

లంకెలపాలెం, ఫిబ్రవరి 20: చేసిన అప్పులు తీర్చే దారి లేకపోవడంతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్‌నాయక్ (21) లంకెలపాలెంలోని ఒక లాడ్జిలో పనిచేస్తున్నాడు. ఇతని పెదనాన్న కొడుకు అతిశ్‌కుమార్‌తో కలిసి లాడ్జినే ఒక గదిలో ఉంటున్నారు. మంగళవారం ఉదయం అతిశ్‌కుమార్ బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత తిరిగి రూమ్‌కు వచ్చాడు. ప్రశాంత్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకుని కనిపించాడు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. అతిశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిలాన్ మెరుపులు

... 5వ పేజీ తరువాయి

పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానాలు, భూమిపై, సముద్రంపై పనిచేయగల యుహెచ్3హెచ్ హెలికాప్టర్లు, మిగ్ 29కే విమానాలు వాటి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. 'ఫ్లై పాస్ట్' పేరుతో 60 యుద్ధ విమానాలు వరుస క్రమంలో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. మెరైన్ కమెండోల సాహస ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, మలేషియా, వియత్నాం, రష్యా, ఫ్రాన్స్, ఇరాన్, మారిషస్ దేశాల నేవీ దళాలు, సీ కాడెట్లు, ఏపీ పోలీస్, ఎన్‌సీసీ, కోరుకొండ సైనిక్ స్కూల్, నేవీ చిల్డ్రన్ స్కూల్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ కోస్టుగార్డ్ బృందాలు కవాతు నిర్వహించాయి. నేవీ స్కూల్ విద్యార్థులు వివిధ రంగులతో భావావేశాలను ప్రదర్శించే నృత్యరూపకం కరతాళ ధ్వనులు అందుకుంది. యుద్ధ విమాన వాహక నౌకలు విక్రాంత్, విక్రమాదిత్యలు గంభీరంగా సముద్రంలో నిల్చొని భారత నౌకదళం శక్తిని ప్రతిబింబించాయి.

వివిధ ప్రాంతాల్లో రెండో రోజు

మిలాన్ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆరోగ్య నడక, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. డాల్ఫిన్ కొండపై 600 మందికి పైగా ట్రెక్కింగ్ చేశారు. యారాడ బీచ్‌లో యోగా నిర్వహించారు. యాభై దేశాల నుంచి వచ్చిన యువ నేవీ ఆఫీసర్లు అనుభవాలను పంచుకున్నారు. వీరంతా కలిసి ఐఎన్ఎస్ తరంగిణి నౌకపై సెయిలింగ్ చేశారు. హిందూస్థాన్ షిప్‌యార్డులో డీప్ సబ్‌మెర్జిన్ రెస్క్యూ వెహికల్ ద్వారా సబ్‌మెరైన్లను రక్షించే విధానం చూపించారు.



హెలికాప్టర్ల పైనుంచి సముద్రంలోకి దిగుతున్న కమాండో

50 రోజుల్లో రాష్ట్ర రాజకీయ చరిత్ర మారబోతోంది..


» తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత



కోటవురట్ల, ఫిబ్రవరి 20: మరో 50 రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్చేస్తున్నారని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగపూడి అనిత అన్నారు. మంగళవారం కోటవురట్లలో జరిగిన నారా లోకేశ్ శంఖారావం సభలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలు చంద్రబాబునాయుడు చేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య పాయకరావుపేట నియోజకవర్గంలో రూ.1700 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. తాతగారి పౌరుషం, తండ్రి ఆశయాలు పుణికిపుచ్చుకున్న నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అనిత కొనియాడారు. శంఖారావం సభతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. నాలుగేళ్లు పబ్జీ ఆడుకున్న జగన్ కలుగులో నుంచి బయటకు వచ్చి సిద్ధం అంటున్నారని ఆమె విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని వలంటీర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అంతకన్నా మంచి పథకాలు అమలు చేస్తామన్నారు. టీడీపీ హయాంలో ఆక్వా పార్కుకు శంకుస్థాపన చేస్తే అదే ప్రాజెక్టుకు మళ్లీ శంకుస్థాపన చేసి రూ. 30 కోట్లు కొట్టేశారన్నారు. ఇంటింటికి కొళాయి సరఫరా చేసే భారీ రక్షిత నీటి పథకానికి టీడీపీ ప్రభుత్వ హయంలో రూ.180 కోట్లు మంజూరు చేస్తే దానిని వైసీపీ ప్రభుత్వం ఆటకెక్కించిందన్నారు. చంద్రబాబునాయుడు అనే నేను విని వరకు కార్యకర్తలు, నాయకులు అవిశ్రాంతంగా పనిచేయాలని అనిత పిలుపునిచ్చారు.

జగన్‌ను ఇంటికి సాగనంపాలి

» జనసేన సమన్వయకర్త గెడ్డం బుజ్జి



కోటవురట్ల, ఫిబ్రవరి 20: ముఖ్యమంత్రి జగన్ రావణాసురుడిలా ప్రజలను వేధిస్తున్నారని, అటువంటి వ్యక్తిని ఇంటికి సాగనంపాలని జనసేన పాయకరావుపేట సమన్వయకర్త గెడ్డం బుజ్జి అన్నారు. మంగళవారం జరిగిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలగాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాల్సిందన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ పాలన ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో 15వేల మంది రైతులు, 2 వేల మంది కార్మికులను రోడ్డున పడ్డారన్నారు. ఒక్కొక్క ఫ్యాక్టరీకి రూ.10 కోట్లు చొప్పున బకాయిలు చెల్లించి తిరిగి వాటిని పునఃప్రారంభించాలని కోరారు. మత్స్యకారుల జీవనోపాధిని కూడా జగన్ ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. రాబోయే రోజుల్లో బటన్ నొక్కి జగన్‌ను ప్రజలు ఇంటికి సాగనింపాలని కోరారు. చిన్నవాడైనా లోకేశ్ సహనం, ఓపికతో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జగన్ వచ్చాక పోలవరం ప్రాజెక్టు పనులు 2 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రానికి పట్టిన పీడ వదలాంటే సైకో పోవాలి, సైకిల్, గ్లాసు రావాలని గెడ్డం బుజ్జి పిలుపునిచ్చారు.

‘టెన్త్‌లో శత శాతం ఫలితాలు రావాలి’

సబ్బవరం, ఫిబ్రవరి 20 : మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించాలని ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలో తవ్వవానిపాలెం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థుల కోసం అదనపు క్లాసులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం, ఆరోగ్య సురక్ష పథకం అమలును పరిశీలించారు. స్కూల్ రికార్డులు తనిఖీ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వైభవంగా చుక్కఅక్కులు తీర్థం

పరవాడ, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలో చుక్కఅక్కులు తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక చుక్కఅక్కులు మందిరం వద్ద పూజలు నిర్వహించారు. తీర్థం సందర్భంగా కోలాటం, సాముగరిడీలు, చిటికెల భజనలు ఏర్పాటు చేశారు. అలాగే రాత్రి ఏడు గంటల నుంచి అన్నసమారాధనను నిర్వహించారు. నిర్వాహకుడు గండి నమోబాబు పర్యవేక్షణలో తీర్థం ఘనంగా జరిగింది.

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 20: ఫార్మాసిటీకి ఆనుకుని ఉన్న పెదతాడిలోని పాన్‌షాపులో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో మంగళవారం రాత్రి సోదాలు చేశారు. ఈ సోదాల్లో ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని జుత్తిక మాధవరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రోటరీ ఆస్పత్రిలో ఏడుగురికి ఉచిత కంటి ఆపరేషన్లు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 20 : ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఏడుగురికి ఉచిత కంటి ఆపరేషన్లు డాక్టర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదు రోజులకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో రవిరాం జవహర్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ అమ్మవారి తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలో కొలువైన దుర్గమాంబ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిగింది.

‘హ్యూమన్ రైట్స్’ నేషనల్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 20 : హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్‌కు నేషనల్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన దొడ్డి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈయనకు హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ నరేంద్రర్ ఆరోరా నియామకపత్రాన్ని ఢిల్లీలో అందించారు. చంద్రశేఖర్ ప్రశాంతినికేతన్ స్కూల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్

అభివృద్ధి అంతా మాటల్లోనే.. చేతల్లో మాత్రం శూన్యం

»అధికారులపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

అనకాపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి అంతా అధికారులు కేవలం కాగితాపైనే చూపిస్తున్నారని, చేతల్లో మాత్రం శూన్యమని పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. మంగళవారం ఎంపీ డీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. మార్టూరు సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు మాట్లాడుతూ అధికారులు అభివృద్ధి పనులను కాగితాలపైనే చూపిస్తున్నారన్నారు. కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవడంలో శూన్యమన్నారు. పిసినికాడ సర్పంచ్ యల్లపు రమేష్ మాట్లాడుతూ జల జీవన్‌మిషన్ ద్వారా వేసిన ఇంటింటి కొళాయిల వల్ల ప్రయోజనం లేదన్నారు. పాత పద్ధతిలో వీధి కొళాయిలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడు మాట్లాడుతూ మండలంలో విలువైన భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని, రెవెన్యూ వ్యవస్థ అత్యంత దారుణంగా ఉందన్నారు. బవులవాడ ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కేవలం సర్పంచ్ స్వప్రయోజనం కోసం జగనన్న లేఅవుట్‌లను తారుమారు చేసి లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తమ పంచాయతీలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు భీశెట్టి వరహా సత్యవతి మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై కొత్తూరు పంచాయతీ పరిధిలో రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

వచ్చే సమావేశానికి హాజరయ్యే అధికారులు ఈ మూడు నెలల్లో చేపట్టిన పనుల చిట్టాను ప్రజాప్రతినిధుల ముందు ఉంచాలన్నారు. ఈ సమావేశానికి ముందు ఇదే స్థలంలో వలంటీర్లకు పురస్కారాల కార్యక్రమం గంటన్నరసేపు నిర్వహించడంతో టీడీపీ సభ్యులు ఎంపీపీపై ఆగ్రహించి, సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా వినియోగించుకుని మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే సభ్యులు వెల్లడించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ బీవీ సత్యవతి, జడ్పీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 604 జంటలకు రూ.3.57 కోట్లు జమ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 20: జిల్లాలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం కింద 604 జంటలకు రూ.మూడు కోట్ల 57 లక్షల 20వేలు జమ చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో కల్యాణమస్తు పథకం కింద మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఏపీడీ డైజీ పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి శతజయంతి ఉత్సవాలు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం భీష్మ ఏకాదశికి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమ్మవారి ప్రతిష్ఠ, శత జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రామాచార్యులు ఆధ్వర్యంలో 108 మంది మహిళలచే 108 కలశాలతో శోభాయాత్ర ఆలయం నుంచి ప్రారంభమై మెయిన్‌రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్, మళ్లవరపువారివీధి మీదుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, శేషుకుమార్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 20: మండలంలో పలు అభివృద్ధి పనులను అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు మంగళవారం ప్రారంభించారు. ఖాజీపాలెం, తిమ్మరాజుపేట, పెదపాడు, ఎంజేపురం, చోడపల్లి, మడుతూరు, చీమలాపల్లి పంచాయతీల్లో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకే, దోబీఖానాలు, రోడ్లు ప్రారంభించారు. కోన బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, భీముని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళితులంటే ధర్మశ్రీకి చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమానికి తమను ఆహ్వానించలేదని, కనీసం మాటమాత్రంగా అయినా సమాచారం ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎంపీటీసీ సభ్యుడిగా మూడు పర్యాయాలు, వైస్ ఎంపీపీగా ఒకసారి పాలన అందించిన తనకు పంచాయతీ పాలన చేయలేవని ఎమ్మెల్యే పేర్కొనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే తమను అవమానిస్తున్నప్పటికీ పార్టీ కోసం భరిస్తూ వచ్చామని, ధర్మశ్రీ తీరు మార్చుకోక పోతే వైసీపీని వీడక తప్పదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు కోరుకొండ సూరి అప్పారావు (సర్పంచ్ భర్త), దాడి గోవింద, పొలిమేర కృష్ణ, కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సరేష్, సయ్యపురెడ్డి రజనీ, బత్తుల రాజా పాల్గొన్నారు.

జనాన్ని తెండి...

... 5వ పేజీ తరువాయి

పీడీలు, ఏపీడీలకు కట్టబెట్టారు. జోనల్ కమిషనర్లు పైనుంచి అన్నీ చూసుకోవాలని సూచించారు. విమానాశ్రయంలో టోల్‌ప్లాజా మొదలుకొని విమాననగర్ బస్టాప్, ఈటర్స్ స్టాపు, దుర్గానగర్ బస్టాప్, బిగ్ న్యూ మొబైల్ షాపు, విజేత సూపర్ మార్కెట్, రిలయన్స్ డిజిటల్స్, లక్ష్మీ షాపింగ్‌మాల్, సీఎంఆర్ షాపింగ్ మాల్, సింహాచలం పెట్రోల్ బంకు, గోపాలపట్నంలో బెహరా ఆస్పత్రి, భారతి కల్యాణ మండపం, వేపగుంట జంక్షన్, జోన్-8 కార్యాలయం...ఇలా చినముషిడివాడ జంక్షన్ వరకు 24 పాయింట్లు గుర్తించారు. పాయింట్‌కు 500 మంది చొప్పున మొత్తం పది వేల మందికి తక్కువ లేకుండా జనాలను తేవాలని ఆదేశాలు అందాయి. విమానాశ్రయం నుంచి ఎక్కడా ఆగకుండా కాన్వాయ్‌లో వెళ్లిపోయేటపుడు ఈ జంక్షన్ల వద్ద జనాలు ఎందుకో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కన్నబాబురాజు అక్రమార్జనను వెలికితీస్తాం

... 5వ పేజీ తరువాయి

కంపెనీల కార్మికులు, ఉద్యోగుల రవాణాకు వినియోగించి భారీగా సొమ్ము గడించారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఅవుట్‌లుగా వేసి అమ్ముకున్నారని, వీటినిఇ ఆధారాలతో బహిర్గతం చేస్తామని చెప్పారు. కన్నబాబురాజు సెజ్‌లో ప్రతి కంపెనీ/ కర్మాగారం నుంచి బలవంతంగా నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో వైసీపీకి చెందిన దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, దోసూరు సర్పంచ్ భర్త నర్మాల రామకృష్ణ, చిప్పాడ ఎంపీటీసీ సభ్యుడు రాజాన పైడి బాస్కరరావు, పూడిమడక ఎంపీటీసీ సభ్యురాలి భర్త మేరుగు అప్పలనాయుడు, వైసీపీ సీనియర్ నాయకుడు ద్వారపురెడ్డి బాపూజీ, పీలా సందీప్, తుమ్మల రాజు, జనసేనకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, సెజ్ పునరావాస కమిటీ ఛైర్మన్ బైలపూడి శ్రీరామదాసు, పైల రామునాయుడు, టీడీపీ నుంచి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడుబాబు, జంగులూరు మాజీ సర్పంచ్ లాలం నాగేశ్వరరావు, గాయత్రి నాయుడు బాబు, పూడి మాజీ సర్పంచ్ లాలం రమణ, తదితరులు పాల్గొన్నారు.

పేట టీడీపీకి కంచుకోట

... 5వ పేజీ తరువాయి

ఆయనకు తెలియదు అని వైసీపీ సమన్వయకర్త కంబాల జోగులును ఉద్దేశించి అన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా వున్న వ్యక్తి నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయించలేకపోయారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో టీటీడీ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించి ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశామని లోకేశ్ చెప్పారు. వైసీపీ వచ్చిన తరువాత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదన్నారు. ఉద్దండపురం మెగా వాటర్ ప్రాజెక్టును ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. పందూరు, జల్లూరు వంతెన నిర్మాణ పనులు టీడీపీ హయాంలో మొదలుపెట్టగా, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. మత్స్యకారుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన ఈ సభలో నియోజకవర్గం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, పెట్ల లింగంనాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్ పాల్గొన్నారు.

మాడుగులలో ప్రకృతి సంపద దోపిడీ

... 5వ పేజీ తరువాయి

‘శంఖారావం’ సభలో లోకేశ్ మాట్లాడుతూ, గత ఐదేళ్లలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయించలేదని, రోడ్లపై ఏర్పడిన గోతులను కూడా పూడ్చలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ ఉచిత కొళాయి పథకం కింద నిధులు ఇస్తుంటే.. మంత్రి తన వాటాల కోసం ప్రాజెక్టును నీరుగారుస్తున్నారని లోకేశ్ ఆరోపించారు. పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు, పోస్టింగుల కోసం మంత్రికి ముడుపులు సమర్పించుకోవాల్సిందేనని విమర్శించారు. నియోజకవర్గంలో ఉన్న గ్రానైట్ క్వారీల యజమానుల నుంచి ప్రతి నెలా కోటి రూపాయలు మంత్రికి ముడుపులు రూపంలో సమర్పించుకోవాల్సిందేనని లోకేశ్ ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఇతర శాఖల మంత్రులతో మాట్లాడి నియోజకవర్గంతోపాటు జిల్లాను కూడా ఎంతో అభివృద్ధి చేయవచ్చని, కానీ అవినీతి పనులకు తప్ప, అభివృద్ధి పనుల కోసం ఫోన్లు చేయరని విమర్శించారు.

తెలుగుదేశం హయాంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే లేకపోయినప్పటికీ మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. ఎన్నికల అనంతరం టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, నియోజకవర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని లోకేశ్ స్పష్టం చేశారు. తాచేరు, ఉరకగెడ్డ ప్రాజెక్టులు, కలిగొట్ల, దేవరాపల్లి వంతెనల నిర్మాణ పనులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. మాడుగుల డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. ఈ సభలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను దోచుకుంటున్న వైసీపీ నేతలు

... 5వ పేజీ తరువాయి

ఉక్కు ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. గత ఎన్నికల ముందు ఉమ్మడి విశాఖ జిల్లాలో పాదయాత్ర చేసిన సందర్భంగా జగన్ 50కిపైగా హామీలు ఇచ్చారని, సీఎం అయిన తరువాత వాటి అమలును మరిచిపోయారని విమర్శించారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదని, మెట్రో ప్రాజెక్టు పనులు మొదలు పెట్టలేదని, మూడు సహకార షుగర్ ఫ్యాక్టరీలను మూసి వేయించారని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఎనిమిది లక్షల ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని లోకేశ్ చెప్పారు. జిల్లాకు పరిశ్రమలు తెస్తామని వైసీపీ పాలకులు చెప్పగా, కోడిగుడ్డు మంత్రి దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోతున్నాయని దుయ్యబట్టారు.

అయ్యన్నను చూస్తే వైసీపీకి వణుకు

“నర్సీపట్నం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఇక్కడో పులి ఉంది. ఆయనే అయ్యన్నపాత్రుడు. వైసీపీ ప్రజావ్యతిరేక పాలనపై పోరాడుతున్న ఆయనపై గత ఐదేళ్లలో 17 అక్రమ కేసులు పెట్టారు. వాటిలో అత్యాచారయత్నం కేసు కూడా ఉండడం దారుణం. అయ్యన్నను చూస్తే వైసీపీ ప్రభుత్వానికి వణుకు పుడుతున్నది” అని లోకేశ్ అన్నారు. అయ్యన్నపాత్రుడు ఇద్దరు కుమారులపైనా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో నర్సీపట్నం నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. 2019లో తెలిసో తెలియకో పని చేసే నాయకుడిని కాదని, గణేశుడిని గెలిపించారని, దేవుడు పేరు పెట్టుకొని చెడ్డ పనులు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక, లేటరేట్ మైనింగ్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే ఐదేళ్లలో రూ.150 కోట్లు దోచేశారని ఆరోపించారు. పేద ప్రజలకు ఇచ్చిన భూములను తక్కువ ధరకు కొని, ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్న ఘనుడని విమర్శించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చంపారని ఆరోపించారు.

నర్సీపట్నం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాబోతున్నదని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని లోకేశ్ చెప్పారు. నర్సీపట్నంలో టిడ్కో ఇళ్లను వంద రోజుల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నర్సీటప్నంలో మినీ ఐటీడీఏ, గిరిజన భవన్ ఏర్పాటుకు కృషి చేస్తామని, తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. మాడుగుల నుంచి 35 కిలోమీటర్ల దూరంలో వున్న నర్సీపట్నం రావడానికి రెండు గంటల సమయం పట్టిందంటే రోడ్డు ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చని లోకేశ్ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లను అభివృద్ధి చేస్తామని, వరహా నదిపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు



అలంకరణలో స్వామివారు

నక్కపల్లి, ఫిబ్రవరి 20: మండలంలో మంగళవారం భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కొండపై వున్న స్వామివారి నిజరూపానికి పంచామృతాభిషేకం చేశారు. కింద ఆలయంలో వున్న క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పుష్పమాలలు,పట్టుపీతాంబరాలతో అలంకరించారు. భక్తులు స్వామివారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉపమాక మెరకవీధిలో శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో 24 గంటల ఏకాహం ప్రారంభించారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఎలమంచిలి, ఫిబ్రవరి 20: తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ జిల్లా నేత ఆడారి ఆదిమూర్తి ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పట్టణ సమీపంలో రజక కులస్థులతో సమావేశమై టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రానున్న టీడీపీ, జనసేన పభుత్వంలో వాటి పరిష్కారానికి ముందుంటానని తెలిపారు.

‘గిరిజన కూలీలకు డబ్బులు ఇవ్వాలి’

ఎలమంచిలి, ఫిబ్రవరి 20 : మండలంలోని పులపర్తి సమీపంలో నిర్మిస్తున్న ప్రైవేటు పరిశ్రమలో 20 రోజులు పాటు సెంట్రింగ్ పనులు చేసిన గిరిజన కూలీలకు డబ్బులు ఇవ్వని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము కార్మిక శాఖ అధికారులను కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలానికి చెందిన గిరిజన యువకులు మోసపోయారన్నారు. కార్యక్రమంలో బాధితులు మోహన్, బురిడి సాయి, బీమన్న, రమేష్‌లు పాల్గొన్నారు.

చింతాలమ్మను దర్శించుకున్న పీలా

అనకాపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊడేరు చింతాలమ్మ అమ్మవారిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకుని, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి బాబి, బత్తుల రమేష్, సిరసపల్లి రమేష్, శివశంకర్, అచ్చిబాబు, సందిన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ బాబా మహారాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జార్జిక్లబ్‌లో నిర్వహించిన యోగా శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడి, బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్, ఊబకాయం, థైరాయిడ్, వెన్నుపూస, కీళ్ల నొప్పులకు యోగా సాధన ద్వారా చెక్ పెట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో జార్జిక్లబ్ ప్రతినిధులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వనాథం, కాండ్రేగుల వాసు, మళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి పండుగ

పరవాడ, ఫిబ్రవరి 20: పిట్టవానిపాలెం పైడిమాంబ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, వార్డు టీడీపీ అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను నిర్వహించారు.సాయంత్రం అమ్మవారి ఘటాలు గ్రామంలో ఊరేగించి ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

వైభవంగా పాండురంగడి చక్రస్నానం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న ప్రధానార్చకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 20: పట్టణంలోని రాధా రుక్మిణి సహిత పాండురంగ స్వామివారికి మంగళవారం ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కృష్ణస్వామి, నారాయాణచార్యులు పాండురంగస్వామికి పూజలు అనంతరం స్వామివారి చక్రస్నాన క్రతువును నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్, దేవస్థానం మాజీ ఛైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, భక్తులు స్వామిని దర్శించి, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.వెంకటాద్రి సేవలు అందజేశారు.

వైభవంగా లక్ష్మీమాధవస్వామి కల్యాణం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 20: మండలంలోని రేవుపోలవరం కొండపై ఉన్న ఆలయంలో లక్ష్మీమాధవస్వామి కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో మాఘ పౌర్ణమికి ముందు వచ్చే ఏకాదశి నాడు కల్యాణం జరుపుతుంటారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలతోపాటు నిర్వాహకులు అచ్యుతరామరాజు, ఎన్. వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఆధార్, మీ-సేవ సెంటర్లు ఉండాలి

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 20: సచివాలయాల్లోని ఆధార్ సెంటర్లు, మీ-సేవ సెంటర్లన్నీ నిబంధనల ప్రకారమే ఉండాలని నర్సీపట్నం డివిజనల్ డెవలప్‌మెంట్, మీ-సేవ విజిలెన్స్ ఆఫీసర్ ఎం.ఉదయశ్రీ అన్నారు. మంగళవారం రెండు ఆధార్ సెంటర్లు, పలు సచివాలయాలు, మీ-సేవ కేంద్రాలను విజిలెన్స్ ఆఫీసర్ ఉదయశ్రీ, జూనియర్ అసిస్టెంట్ కె. రామకృష్ణతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆధార్ సెంటర్లు, మీ-సేవ సెంటర్లు వాటికి కేటాయించిన అడ్రస్‌ల్లో ఉన్నాయా? లేదా? డాష్ బోర్డులు, ధరల పట్టికలు అన్నీ ఉన్నాయా? లేదా అనేది పరిశీలించారు.

ఘనంగా గంగాదేవి అమ్మవారు మహోత్సవం

అనకాపల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని జి.భీమవరంలో గంగాదేవి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘పేట’ చేరుకున్న పీవీఆర్ పాదయాత్ర

పాయకరావుపేట, ఫిబ్రవరి 20 : తెలగ కులస్థులను బీసీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షుడు పల్లెంట్ల వెంకట రామారావు(పీవీఆర్) చేపట్టిన ఉత్తరాంధ్ర తెలగ జాతి ఆత్మగౌరవ పాదయాత్ర మంగళవారం పాయకరావుపేట చేరుకుంది. ఈయన ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర చేశారు. స్థానిక వై జంక్షన్ వద్ద ఆయనకు కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాపు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బొల్లం గణేశ్, నాగం రామన్నదొర, పడాల సోమన్నదొర, పల్లెల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలి : జేసీ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : జిల్లాకు క్రీడల్లో మరిన్ని బహుమతులను సాధించాలని ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో విజయం సాధించిన ఖోఖో, కబడ్డీ జట్లకు జేసీ ఎం.జాహ్నవి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన తుమ్మపాల ఖోఖో జట్టు, రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం పొందిన కె.సాలాపువానిపాలెం కబడ్డీ జట్టును జేసీ అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ నాగేశ్వరరావు, పీడీలు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

రెండు గ్రామాల్లో తలుపులమ్మ పండగ

గొలుగొండ, ఫిబ్రవరి 20: మండలంలోని ఏటిగైరం పేట, పుత్తడిగైరంపేట గ్రామాల్లో మంగళవారం తలుపులమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక విద్యుత్ దీపాలతో అంకరించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ, ఏటిగైరంపేటసర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు చింతకాయల కాంతం, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పండగలను నిర్వహించారు.

డి.యర్రవరంలో తోడపెద్దు అచ్చు మహోత్సవం

నాతవరం, ఫిబ్రవరి 20: మండలంలోని డి.యర్రవరంలో తోడపెద్దు అచ్చు మహోత్సవాన్ని గ్రామస్థులు అట్టహాసంగా నిర్వహించారు.తొలుత తోడపెద్దుకు ఒక ఆవుతో పెళ్లి చేశారు. అనంతరం ప్రత్యేక వేడుక నిర్వహించారు అనంతరం తోడపెద్దుకు అచ్చు వేశారు. అచ్చు వేసిన తొడపెద్దు సింహాద్రప్పన్నగా భావిస్తారు. దీనిని గ్రామంలో ఎవ్వరూ కొట్టరాదని గ్రామస్థులు తీర్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

30 మద్యం సీసాలు పట్టివేత

గొలుగొండ, ఫిబ్రవరి 20: మండలంలోని గొలుగొండలో 30 మద్యం సీసాలతో మహిళ పట్టుబడినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. గొలుగొండలో ముందస్తు సమాచారంతో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా గొలుగొండ గ్రామానికి చెందిన కూరాకుల నారాయణమ్మ వద్ద 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నాతవరం, ఫిబ్రవరి 20 : మండలంలోని మర్రిపాలెం, నాతవరం, శృంగవరం గ్రామాలలో మంగళవారం కళజాత బృందాలు, వీధి నాటకాలు ద్వారా ఎయిడ్స్, హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించారు. రక్తదానం, సుఖవ్యాధులు, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు సంరక్షణ విషయాలపై వీధి నాటకం ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సూర్యకళ, డి. నాయుడు, ఎస్. నాగ సత్యనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో 30 వేలకు పైగా మెజారిటీ

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



నర్సీపట్నం, ఫిబ్రవరి 20 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నర్సీపట్నం నియోజవర్గంలో 30 వేలుకు పైగా మెజార్టీ సాధిస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మంగళవారం బలిఘట్టంలో నారా లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. దీనికి ముందు యువనేత లోకేశ్, మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడుతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ నర్సీపట్నం నియోజవర్గంలో తెలుగుదేశం జెండాని రెపరెపలాడిస్తామన్నారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు,నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, చింతకాయల రాజేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

» జనసేన నర్సీపట్నం ఇన్‌చార్జి సూర్యచంద్ర



నర్సీపట్నం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగిస్తుందని, ఎవరైనా ప్రశ్నిస్తే క్రమ కేసులు పెడుతున్నారని, దీన్ని ఎదుర్కోవాలంటే రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకత ఉందని జనసేన నర్సీపట్నం ఇన్‌చార్జి సూర్యచంద్ర అన్నారు. నర్సీపట్నంలో లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాండవ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని అన్నారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో సెల్‌ఫోన్ లైట్లతో ఆపరేషన్లు చేసే పరిస్థితి ఉందంటే వైసీపీ పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మునిసిపాలిటీ పరిధిలో ఇంటింటికి మంచి నీటి కొళాయిలు ఇస్తామని చెప్పి గోతులు తవ్వేసి వెళ్లి పోయారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమికి ప్రజలంతా ఓట్లు వేసి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 : అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడం హేయమని చర్య అని సీనియర్ జర్నలిస్టు కోసూరి రామకృష్ణ అన్నారు. ఫొటో జర్నలిస్ట్‌పై దాడికి నిరసనగా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టుపై దాడినితీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేశాయాలని, జర్నలిస్టులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పులిగా రామ్మోహన్ మురళి, కార్యదర్శి లంక శివ కుమార్, గౌరవాధ్యక్షుడు గొర్లి రాజు, కోట్ని రాజశేఖర్, జెట్టి శంకర్, బీజా రామ్‌కుమార్, కె.తాతాజీ, కె.జగదీష్, పల్లా గోవిందరావు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకి వినతిపత్రాన్ని అందజేస్తున్న విలేకరులు



నేత్రపర్వంగా లక్ష ప్రమిదల దీపారాధన

నర్సీపట్నం, ఫిబ్రవరి 20 : భీష్మ ఏకాదశి సందర్భంగా షిర్డీ సాయిబాబా ఆలయలో లక్ష ప్రమిదల దీపోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. మంగళవారం ఎన్టీఆర్ మిని స్టేడియంలో అయోధ్య రామమందిరం ఆకృతిలో ప్రమిదలు అమర్చి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, చింతకాయల సన్యాసిపాత్రుడు సాయిబాబాని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేలాది మందికి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి రాంగోపాల్, కార్యదర్శి రామచంద్రరావు, ట్రెజరర్ లంక ఈశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధారమఠంలో శివుని ఊరేగింపు

గొలుగొండ, ఫిబ్రవరి 20: భీష్మఏకాదశి సందర్భంగా ధారమఠం శివుని విగ్రహాలను పలుగ్రామాల్లో ఊరేగించారు. మండలంలోని ఉమాధారమల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో జోగంపేట, కొత్తపాలెం, గొలుగొండ, జానకిరాంపురం, నర్సింగబిల్లి, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో మంగళవారం ఊరేగింపు చేపట్టారు. ఉత్సవ విగ్రహాలకు గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాకవరపాలెం, ఫిబ్రవరి 20: చెట్టు పైనుంచి జారి పడి తీవ్ర గాయాలతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడని ఎస్ఐ.రామకృష్ణరావు తెలిపారు. మాకవరపాలెం మండలం జి.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి పెంటయ్య(60) మేకల రొట్ట కోసం ఈనెల 18వ తేదీన చింతచెట్టు ఎక్కాడు. అయితే ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి జారి పడిపోయాడు. అతనిని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

నల్లమారెమ్మ జాతరకు గరగలు ఊరేగింపు

మాకవరపాలెం,ఫిబ్రవరి 20: మండలంలో కొండలఅగ్రహారంలో నల్లమారెమ్మ జాతరకు మంగళవారం గరగలను ఊరేగించారు. పండగను నిర్వహించేందుకు మూడు రోజులుపాటు గ్రామంలో గరగలను ఊరేగిస్తారు. అనంతరం మూడో రోజు పండగను నిర్వహిస్తారు. ఈ మూడు రోజులు రాత్రి సమయంలో గరగలను ఊరంతా ఊరేగించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంటకరాజు, గ్రామ పెద్దలు పొలిరెడ్డి రమణ, చిటికల రమణ, ఈశ్వరరావు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను దోచుకుంటున్న వైసీపీ నేతలు

... 5వ పేజీ తరువాయి

ఉక్కు ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. గత ఎన్నికల ముందు ఉమ్మడి విశాఖ జిల్లాలో పాదయాత్ర చేసిన సందర్భంగా జగన్ 50కిపైగా హామీలు ఇచ్చారని, సీఎం అయిన తరువాత వాటి అమలును మరిచిపోయారని విమర్శించారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదని, మెట్రో ప్రాజెక్టు పనులు మొదలు పెట్టలేదని, మూడు షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయించారని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని లోకేశ్ చెప్పారు. జిల్లాకు పరిశ్రమలు తెస్తామని వైసీపీ పాలకులు చెప్పగా, కోడిగుడ్డు మంత్రి దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోతున్నాయని దుయ్యబట్టారు.

అయ్యన్నను చూస్తే వైసీపీకి వణుకు

"నర్సీపట్నం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఇక్కడో పులి ఉంది. ఆయనే అయ్యన్నపాత్రుడు. వైసీపీ ప్రజావ్యతిరేక పాలనపై పోరాడుతున్న ఆయనపై గత ఐదేళ్లలో 17 అక్రమ కేసులు పెట్టారు. వాటిలో అత్యాచార యత్నం కేసు కూడా ఉండడం దారుణం. అయ్యన్నను చూస్తే వైసీపీ ప్రభుత్వానికి వణుకు పుడుతున్నది" అని లోకేశ్ అన్నారు. అయ్యన్నపాత్రుడు ఇద్దరు కుమారులపైనా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో నర్సీపట్నం నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. 2019లో తెలిసో తెలియకో పనిచేసే నాయకుడిని కాదని, గణేశుడిని గెలిపించారని, దేవుడు పేరు పెట్టుకొని చెడ్డ పనులు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక, లేటరేట్ మైనింగ్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే ఐదేళ్లలో రూ.150 కోట్లు దోచేశారని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన భూములను తక్కువ ధరకు కొని, ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్న ఘనుడని విమర్శించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చంపారని ఆరోపించారు.

నర్సీపట్నం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాబోతున్నదని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని లోకేశ్ చెప్పారు. నర్సీపట్నంలో టిడ్కో ఇళ్లను వంద రోజుల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నర్సీపట్నంలో మినీ ఐటీడీఏ, గిరిజన భవన్ ఏర్పాటుకు కృషి చేస్తామని, తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. మాడుగుల నుంచి 35 కిలోమీటర్ల దూరంలో వున్న నర్సీపట్నం రావడానికి రెండు గంటల సమయం పట్టిందంటే రోడ్డు ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చని లోకేశ్ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లను అభివృద్ధి చేస్తామని, వరహా నదిపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, మాజీ ఎమ్మెల్యే రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జనాన్ని తెండి...

... 5వ పేజీ తరువాయి

పీడీలు, ఏపీడీలకు కట్టబెట్టారు. జోనల్ కమిషనర్లు పైనుంచి అన్నీ చూసుకోవాలని సూచించారు. విమానాశ్రయంలో టోల్‌ప్లాజా మొదలుకొని విమానగనర్ బస్టాప్, ఈటర్స్ స్టాప్, దుర్గానగర్ బస్టాప్, బిగ్ న్యూ మొబైల్ షాపు, విజేత సూపర్ మార్కెట్, రిలయన్స్ డిజిటల్స్, లక్ష్మీ షాపింగ్‌మాల్, సీఎంఆర్ షాపింగ్ మాల్, సింహాచలం పెట్రోల్ బంకు, గోపాలపట్నంలో బెహరా ఆస్పత్రి, భారతి కల్యాణ మండపం, వేపగుంట జంక్షన్, జోన్-8 కార్యాలయం...ఇలా చినముషిడివాడ జంక్షన్ వరకు 24 పాయింట్లు గుర్తించారు. పాయింట్‌కు 500 మంది చొప్పున మొత్తం పది వేల మందికి తక్కువ లేకుండా జనాలను తేవాలని ఆదేశాలు అందాయి. విమానాశ్రయం నుంచి ఎక్కడా ఆగకుండా వెళ్లిపోయేటపుడు ఈ జంక్షన్ల వద్ద జనాలు ఎందుకో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

చోడవరం
నియోజకవర్గం

ఏటవతల గ్రామాల్లో అమ్మవారి జాతరలు

చోడవరం, ఫిబ్రవరి 20: మండలంలోని ఏటవతల గ్రామాల్లో మంగళవారం అమ్మవారి జాతరలు ఘనంగా నిర్వహించారు. ఏటా ఒకే రోజున నిర్వహించే ఈ జాతరల సందర్భంగా ఆయా గ్రామాల్లో పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్ల పందాల పోటీలు ఏర్పాటు చేశారు. కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం గ్రామాల్లో బొర్రాలమ్మ జాతరను, గోవాడ, పీఎస్ పేట, చోడవరంలోని కోటవీధి గ్రామాల్లో పరదేశమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. టీడీపీ పట్టణ నేత ముడుసు గోవింద్ అమ్మవారిని దర్శించుకున్నారు. కన్నంపాలెంలో జరిగిన అమ్మవారి జాతరకు అనకాపల్లికి చెందిన నేత మలసాల భరత్ హాజరయ్యారు. వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఎంపీపీ గాడి కాసులతో పాటు మండలంలోని అన్ని పార్టీల నాయకులు జాతరలో పాల్గొన్నారు. గోవాడలోని అమ్మవారిని స్థానిక నేతలు ఏడువాక తదితరులు దర్శించుకున్నారు.

ఈవీఎంలపై అవగాహన

రావికమతం, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు మంగళవారం మాక్ ఓటింగ్ నిర్వహించారు. తహసీల్దార్ రమణారావు పాటు ఆర్ఐ సతీష్, వీఆర్వోలు పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసిన గుర్తుకు చెందినదా? లేదా? అనే విషయాలను వివరించారు. ఆ ఓటు వేసిన గుర్తుక పడింది, లేనిది ప్రయోగాత్మకంగా చూపించారు.

చౌకబారు ఆరోపణలు చేస్తే సహించం

» ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, ఫిబ్రవరి 20: చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సీటు కోసం స్థాయి మరిచి టీడీపీ ఇన్‌చార్జి తాతయ్యబాబు, జనసేన నేత రాజు తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదన్నారు. లోకేశ్ ముందు తనపై ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే తగిన సమాధానం చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పల్లా నరసింగరావు, ఏడువాక సత్యారావు, పార్టీ మండల అధ్యక్షుడు డీవీఆర్ పాల్గొన్నారు.

ఐదుగురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 20: దిబ్బిడి శివారులో కోడి పందెలు శిబిరంపై దాడి చేసి ఐదుగుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు. ఈ దాడిలోకోడి పుంజు, రూ.10,220 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నీలకంఠాపురంలో నాటుసారా అమ్ముతున్న దుకాణంపై దాడి చేసి యన్నెంశెట్టి నాయుడును అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. అతని నుంచి 90 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

దళితులంటే ధర్మశ్రీకి చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమానికి తమను ఆహ్వానించలేదని, కనీసం మాటమాత్రంగా అయినా సమాచారం ఇవ్వదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎంపీటీసీ సభ్యుడిగా మూడు పర్యాయాలు, వైస్ ఎంపీపీగా ఒకసారి పాలన అందించిన తనకు గ్రామ పంచాయతీ పాలన చేయలేవని ఎమ్మెల్యే పేర్కొనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే తమను అవమానిస్తున్నప్పటికీ పార్టీ కోసం భరిస్తూ వచ్చామని, ధర్మశ్రీ తీరు మార్చుకోకపోతే వైసీపీని వీడక తప్పదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు కోరుకొండ సూరి అప్పారావు (సర్పచ్ భర్త), దాడి గోవింద, పొలిమేర కృష్ణ, కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సరేష్, నయ్యపురెడ్డి రజనీ, బత్తుల రాజా, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి లోకేశ్ కృషి

» టీడీపీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్


లోకేశ్ శంఖారావం సభలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి కుమార్... జనసేన పార్టీ ఇన్‌చార్జి రాయవరపు కృష్ణ

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 20: టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి యువనేత నారా లోకేశ్ కృషి చేస్తున్నారని పార్టీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు పండగలకు కానుకలు ఇచ్చి పేదవాని కడుపు నింపేవారని గుర్తుచేశారు. సూపర్-6 పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లి రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరారు. గత నాలుగేళ్లుగా ఇసుక, మట్టి పేరుతో దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. వైసీపీ దుర్మార్గ ప్రభుత్వం, రాక్షస పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ సీఎం జగన్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడులకు ప్రజల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లలో రూ.5కే పేదవానికి భోజనం పెట్టి కడుపు నింపారని, వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసి పేదలకు కడుపు మంట మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు ఇంత దారుణంగా ఉన్నా పట్టించుకోలేదన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇసుక దోపిడీ, భూ దందాలు, మైనింగ్ అక్రమాలను చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేనపొత్తుతో సీఎంగా చంద్రబాబునాయుడును చూడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మాడుగుల కోటపై టీడీపీ జెండా ఎగురవేయడానికి ఇరు పార్టీల అభ్యర్థులు కృషి చేయాలన్నారు. మాడుగుల కోటపై టీడీపీ జెండా ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా అందివ్వాలని సభాపరంగా కుమార్ పిలుపునిచ్చారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

మాడుగుల: మాడుగుల నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించిందని, కానీ ఇక్కడ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ఘాటీ రోడ్డు జంక్షన్ శివారు సురవరం సమీపంలో జరిగిన శంఖారావం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మండలాల్లో రవాణా సౌకర్యం దయానీయంగా ఉందన్నారు. అన్ని వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి చేయడంలో వైసీపీ పాలకులకు చేతకాలేదని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కూడా నియోజకవర్గ పరిధిలోని రైవాడ నీరు వెళ్తుందన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మూసివేతతో చెరకు పంటను రైతులు పండించకుండా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో ప్రజా ప్రభుత్వం వచ్చాక చెరకు రైతులకు రూ.3500 మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని 30 వేల మెజారిటీతో గెలిపించి సత్తాచాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్దా నాగ జగదీశ్వరావు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఎమ్మెల్సీ చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలంలో కాల్వల కప్పివేతపై హైకోర్టు స్టే

చోడవరం, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని ఆర్టీసీకి చెందిన స్థలం లీజు పొందిన వ్యక్తులు ఆర్టీసీకి ఆనుకుని ఉన్న చెరువు కాల్వలను అక్రమంగా కప్పివేసిన పనులపై హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసినట్టు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి చెందిన స్థలాన్ని వాణిజ్య అవసరాల కోసం లీజుకు తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు, కాంప్లెక్స్‌కు అనుకుని ఉన్న పాతచెరువు కాల్వలను అక్రమంగా కప్పివేయడంపై చెరువు పరిధిలోని ఆయకట్టు రైతులు, నీటి ముంపు బాధితులతో కలిసి హైకోర్టును ఆశ్రయించామన్నారు. చెరువు స్థలం అక్రమంగా కప్పివేయడం వల్ల 1600 ఎకరాలకు ఆయకట్టు నీరు అందకపోవడంతో పాటు చెరువుపై ఆధారపడిన 150 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని కోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో ఆర్టీసీ స్థలంలో చెరువు కాల్వల కప్పివేత పనులు నిలిపివేయడంతో పాటు దీనిపై కౌంటరు దాఖలు చేయాలని రెవెన్యూ, జలవనరుల శాఖ, ఆర్టీసీ, పంచాయతీ అధికారులకు కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. కాగా, ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేసి దౌర్జన్యంగా చెరువు కాల్వలను కప్పివేసి ప్రజలను ఇబ్బందిపెట్టే చర్యలను ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించేది లేదని అప్పలరాజు హెచ్చరించారు. ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే ఇటువంటి అక్రమాలను అడ్డుకోవాలన్నారు. లేనిపక్షంలో నిరవధిక పోరాటం చేయక తప్పదని ఆయన స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనంపై ఎంఈవో విచారణ

రావికమతం, ఫిబ్రవరి 20: టి.అర్జాపురం హైస్కూల్‌లో సోమవారం ఉడకని అన్నం పెట్టడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయిన సంఘటనపై ఎంఈవో ఎస్.బ్రహ్మాజీ మంగళవారం విచారణ చేశారు. విద్యార్థులను విడివిడిగా, బహిరంగంగా విచారించగా నిర్వాహకులు ఉడకని అన్నం పెడుతున్నారని తెలిపారు. దీనిపై భోజన నిర్వహకురాలు పడాల దేవిని ఎంఈవో ప్రశ్నించగా కొత్త బియ్యం కావడంతో అన్నం బాగా ఉడికిస్తే ముద్దగా అయిపోతుందని, ఆ అన్నాన్ని విద్యార్థులు తినడం లేదని, కాస్త గట్టిగా వండితే ఇలా అంటున్నారని తెలిపారు. ఇకపై అలా జరగనివ్వమని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా భోజనం తయారు చేస్తామని ఎంఈవోతో పాటు గ్రామ నాయకుల వద్ద హామీ ఇచ్చారు. మళ్లీ పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు.

ఆలయాల్లో భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. స్థానిక ఉమామహేశ్వరీదేవీ ఆలయంలో అభిషేకాలు చేశారు. అలాగే వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు. అలాగే తీర్థ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పురోహితులు ఆదిత్య మూర్తి పూజలు నిర్వహించారు.

పేట టీడీపీకి కంచుకోట

... 5వ పేజీ తరువాయి

ఆయనకు తెలియదు అని వైసీపీ సమన్వయకర్త కంబాల జోగులును ఉద్దేశించి అన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా వున్న వ్యక్తి నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయించలేకపోయారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో టీటీడీ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించి ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశామని లోకేశ్ చెప్పారు. వైసీపీ వచ్చిన తరువాత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదన్నారు. ఉద్దండపురం మెగా వాటర్ ప్రాజెక్టును ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. పందూరు, జల్లూరు వంతెన నిర్మాణ పనులు టీడీపీ హయాంలో మొదలుపెట్టగా, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. మత్స్యకారుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన ఈ సభలో నియోజకవర్గం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, పెట్ల లింగంనాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్, పాల్గొన్నారు.

మాడుగులలో ప్రకృతి సంపద దోపిడీ

... 5వ పేజీ తరువాయి

'శంఖారావం' సభలో లోకేశ్ మాట్లాడుతూ, గత ఐదేళ్లలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయించలేదని, రోడ్లపై ఏర్పడిన గోతులను కూడా పూడ్చలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ ఉచిత కొళాయి పథకం కింద నిధులు ఇస్తుంటే.. మంత్రి తన వాటాల కోసం ప్రాజెక్టును నీరుగారుస్తున్నారని లోకేశ్ ఆరోపించారు. పంచాయతీ రాజ్ శాఖలో బదిలీలు, పోస్టింగుల కోసం మంత్రికి ముడుపులు సమర్పించుకోవాల్సిందేనని విమర్శించారు. నియోజకవర్గంలో ఉన్న గ్రానైట్ క్వారీల యజమానుల నుంచి ప్రతి నెలా కోటి రూపాయలు మంత్రికి ముడుపులు రూపంలో సమర్పించుకోవాల్సిందేనని లోకేశ్ ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఇతర శాఖల మంత్రులతో మాట్లాడి నియోజకవర్గంతోపాటు జిల్లాను కూడా ఎంతో అభివృద్ధి చేయవచ్చని, కానీ అవినీతి పనులకు తప్ప, అభివృద్ధి పనుల కోసం ఫోన్లు చేయరని విమర్శించారు.

తెలుగుదేశం హయాంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే లేకపోయినప్పటికీ మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. ఎన్నికల అనంతరం టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, నియోజకవర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని లోకేశ్ స్పష్టం చేశారు. తాచేరు, ఉరకగెడ్డ ప్రాజెక్టులు, కలిగొట్ల, దేవరాపల్లి వంతెనల నిర్మాణ పనులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. మాడుగుల డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. ఈ సభలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

ప్రశ్నించే గొంతు నొక్కేయడమే ప్రభుత్వ లక్ష్యమా..?

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి జర్నలిస్టుల నిరసన

మాడుగుల, ఫిబ్రవరి 20: ప్రశ్నించే గొంతు నొక్కేయడమే ప్రభుత్వ లక్ష్యమా? అని జర్నలిస్టులు ప్రశ్నించారు. రాప్తాడులో జరిగిన సిద్ధం వైసీపీ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నేతల దాడిని మాడుగుల ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫొటోగ్రాఫర్‌పై దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి దశ్చర్యలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ టి.సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు గౌరీపట్టపు శ్రీనాదరావు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీను, కార్యదర్గ సభ్యుడు సురేష్, పాత్రికేయులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులకు అధిక ప్రాధాన్యం

» ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు, ఫిబ్రవరి 20: మాడుగుల నియోజకవర్గంలో మారుమూల గ్రామాలను కలుపుతూ అంతర్గత రహదారులకు అధిక ప్రాధాన్యత ఇచ్చానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగడం వల్ల నియోజకవర్గంలో సుమారు వంద రోడ్లను అభివృద్ధిపరిచినట్టు చెప్పారు. మండలంలో నూరుశాతం ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. లంకవానిపాలెం, చౌడువాడ పీహెచ్‌సీలను అభివృద్ధి చేశానన్నారు. అంతకు ముందు ఎ.కోడూరు, వి.సంతపాలెం సచివాలయాలు, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రాలను, పొడుగుపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్, వారాడలో బీటీ రోడ్డు, సింగన్నదొరపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ పాల్గొన్నారు.

కన్నబాబురాజు అక్రమార్జనను వెలికితీస్తాం

... 5వ పేజీ తరువాయి

కంపెనీల కార్మికులు, ఉద్యోగుల రవాణాకు వినియోగించి భారీగా సొమ్ము గడించారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఅవుట్‌లుగా వేసి అమ్ముకున్నారని, వీటినిఇ ఆధారాలతో బహిర్గతం చేస్తామని చెప్పారు. కన్నబాబురాజు సెజ్‌లో ప్రతి కంపెనీ/కర్మాగారం నుంచి బలవంతంగా నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో వైసీపీకి చెందిన దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, దోసూరు సర్పంచ్ భర్త నర్మాల రామకృష్ణ, చిప్పాడ ఎంపీటీసీ సభ్యుడు రాజాన పైడిభాస్కరరావు, పూడిమడక ఎంపీటీసీ సభ్యురాలి భర్త మేరుగు అప్పలనాయుడు, వైసీపీ సీనియర్ నాయకుడు ద్వారపురెడ్డి బాపూజీ, పీలా సందీప్, తుమ్మల రాజు, జనసేనకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, సెజ్ పునరావాస కమిటీ చైర్మన్ బైలపూడి శ్రీరామదాసు, పైల రామునాయుడు, టీడీపీ నుంచి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడుబాబు, జంగులూరు మాజీ సర్పంచ్ లాలం నాగేశ్వరరావు, గాయత్రి నాయుడు బాబు, పూడి మాజీ సర్పంచ్ లాలం రమణ పాల్గొన్నారు.